దారంతా అగాధాలు

- అదుపు తప్పితే ప్రమాదమే
- అధ్వానంగా మద్దూరు – గోసాల రోడ్డు మార్గం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కంకిపాడు: దారి మొత్తం అగాధాలు.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలీదు.. అధ్వానంగా ఉన్న రహదారి మార్గం గుండా రాకపోకలు సాగించలేని పరిస్థితి.. కనీసం మరమ్మతులు కూడా చేపట్టని దుస్థితి నెలకొనటం.. బాధాకరం .. సురక్షిత ప్రయాణం మాట అటుంచితే.. క్షేమంగా ఇల్లు చేరే పరిస్థితి ఉందా? అన్న సందేహం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.



బురదమయంగా మద్దూరు - గోసాల రోడ్డు



గోతులమయంగా ఉన్న రహదారి

ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం..

విజయవాడ–దివిసీమ కరకట్టకు అనుసంధానంగా మద్దూరు నుంచి విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిని కలుపుతూ మద్దూరు, వణుకూరు వయా గోసాల రహదారి మార్గం ఉంది. ఎంతో ప్రధానమైన రహదారి మార్గాల్లో ఇది చాలా ముఖ్యమైంది. ఆర్అండ్బీ శాఖ పరిధిలోని ఈ రహదారి ప్రస్తుతం వాహనదారుల అగచాట్లకు అలవాలంగా మారింది. కృష్ణానది ఏటిపాయ నుంచి పలు రీచ్ల ద్వారా సరఫరా అయ్యే ఇసుక ఈ రోడ్డు మార్గం గుండానే సాగుతోంది. పరిమితికి మించి భారీ లోడుతో ఇసుక లారీలు, ట్రాక్టర్లలో ఇసుక సరఫరా అవుతోంది. దీంతో అసలే అధ్వానంగా, గోతుల మయంగా ఉన్న రోడ్డు మార్గం ఛిద్రంగా మారింది. రోడ్డు మార్జిన్లు పూర్తిగా కుంగిపోయాయి. పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అక్కడక్కడా మాటలకు అలవుకాని అగాధాలు వాహనదారులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నిత్యం ఈ మార్గం గుండా ప్రయాణించే లారీలు, ట్రాక్టర్లు, బస్సులు, వాహనదారులను ఈ అగాధాలు భీతిల్లచేస్తున్నాయి.

రోడ్డు మార్జిన్లు కుంగిపోవటంతో వాహనం అదుపుతప్పితే పక్కనే ఉన్న పంట బోదెలోకి వాహనాలు దూసుకుపోయే పరిస్థితి. దీంతో ఎదురుగా భారీ వాహనాలు వస్తే ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు ఆందోళన చెందుతున్నారంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు. జగనన్న కాలనీ సమీపంలో ఆర్అండ్బీ రహదారి ఛిద్రంగా మారింది.

రోడ్డు అభివృద్ధి అంశం ప్రశ్నార్థకం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్దూరు నుంచి ఉప్పలూరు వరకూ ఉన్న ఆర్అండ్బీ రోడ్డు మార్గాన్ని డబుల్ లైన్గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంది. రూ.19.50 కోట్లతో అంచనాలను రూపొందించింది. అయితే ఎన్నికల కోడ్ అమలుతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిధులను పూర్తిగా రద్దు చేసింది. దీంతో రోడ్డు అభివృద్ధి అంశం ప్రశ్నార్థకంగా మారింది. ఆర్అండ్బీ అధికారులు మద్దూరు నుంచి గోసాల వరకూ ఉన్న రోడ్డు మార్గాన్ని రూ.6.50 కోట్ల అంచనాతో సింగిల్ లైన్రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అంచనాలను రూపొందించారు. కానీ నేటికీ రోడ్డు అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయింపులు జరగలేదు. దీంతో రోడ్డు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలింది.

మరమ్మతులు కూడా జరగవా ?

రోడ్డు అభివృద్ధి పక్కన పెడితే కనీసం మరమ్మతులు కూడా నోచుకోని పరిస్థితి నెలకొంది. వణుకూరు ప్రధాన గ్రామంలో స్వల్పంగా మరమ్మతులు జరిగినా పూర్తి స్థాయి మరమ్మతులు మాత్రం నోచుకోలేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు భీతిల్లుతున్నారు. వచ్చేది వర్షాకాలం కావటంతో అగాధాలు, పెద్ద పెద్ద గోతులు, కోతకు గురైన రోడ్డు మార్జిన్ల మీదుగా రాకపోకలు ఎలా సాగించాలో అర్థంకాక ప్రజానీకం ఆవేదన చెందుతున్నారు.

క్లుప్తంగా

నున్నలో భగవద్గీతపై ప్రచారం



నున్న(విజయవాడరూరల్): గురుపౌర్ణమిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంతి ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ సభ్యులు మంగళవారం నున్న గ్రామంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడిని మాత్రమే జగద్గురువుగా ఎందుకు పూజించాలో వివరించారు. ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా, పెద్దగా ఉండటంతో గురుపౌర్ణమిగా నిర్ణయించి, శ్రీ కృష్ణుడుని మాత్రమే జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ అధ్యక్షుడు జగిరపు సురేష్ తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



ఉయ్యూరు: విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని డీవైఈఓ పద్మారాణి అన్నారు. మండలంలోని కడవకొల్లు గ్రామంలో ఎన్ఎంఎంఎస్ సాధించిన విద్యార్థిని కట్టా అలేఖ్యను మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. డీవైఈఓ పద్మారాణి, సర్పంచ్ మంగినేని సుధారాణి విద్యార్థిని అభినందించారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీ హెచ్ఎం ఊర బెనర్జీ, ఉపాధ్యాయులు శ్రీధర్, నాగలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ రాయితీలు

గన్నవరంరూరల్: పండ్ల తోటలు సాగు చేసే రైతులు ప్రభుత్వం అందించే రాయితీలు వినియోగించుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో సాగు అవుతున్న మామిడి పంటకు ఎకరానికి రూ.1.9 లక్షలు, జామకు రూ.1.46 లక్షలు, నిమ్మ ఎకరానికి రూ.1.46, సపోటా రూ.95 వేలు, దానిమ్మ రూ.2.16 లక్షలు, డ్రాగన్ ఫ్రూట్ అర ఎకరానికి రూ.2 లక్షలు, కొబ్బరి ఎకరానికి రూ.99 వేలు, ఆయిల్ పామ్ ఎకరానికి రూ.55 వేలు, ఆపిల్ బేర్ ఎకరానికి రూ.1.26 లక్షలు, మల్లె తోట 0.25 ఎకరాలకు రూ.55 వేలు, గులాబీకి 0.25 ఎకరానికి రూ.63 వేలు పూర్తి ఉచితంగా ఉపాధి హామీ పథకం నిధులు దశల వారీగా అందజేస్తోందన్నారు. రైతులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఏపీఓ సూచించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వాస్పత్రి సైక్రియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ రాఘవరావు అన్నారు. జూన్ 26 మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రిలోని డి ఎడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో కలిసి మత్తు పదార్థాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ రాఘవరావు మాదకద్రవ్యాల వినియోగం, వాటి వలన కలిగే దుష్పరిణామాలు, చికిత్సపై ప్రజలు, రోగులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ శోభ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తారా, డాక్టర్ రామ్నరేష్రెడ్డి, డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు అండగా నిలవాలి



పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీలో సభ్యులుగా చేరే వారు పేద ముస్లిం కుటుంబాలకు సహాయం చేస్తూ అండగా నిలవాలని కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా సూచించారు. మంగళవారం 64వ డివిజన్ కండ్రిక కమిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద ముస్లింలను ఆదుకొనేందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇన్చార్జిలను నియమిస్తున్నామన్నారు. అందులో భాగంగా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కల గ్రామానికి చెందిన అబ్దుల్ అలీభాయ్ని ఇన్చార్జిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశామన్నారు. ఏఎంసీ కమిటీ నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, 64వ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక 22వ డివిజన్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు పంతాల సాయి బాబు ఆధ్వర్యంలో మంగళవారం కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై 'వైఎస్ జగన్ అంటే నమ్మకం...చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు కె.కనకదుర్గ, గొర్ల గోవిందు, కె.నరేష్, కె.నాగిరెడ్డి, ఎం.అజయ్బాబు, జోగా రమణ, కె.శివ, మోహన్కుమార్, రాము, బాబ్జి, రాజేష్, శ్రీరాజ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు క్యాంపస్ డ్రైవ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఐటీఐ ఆఖరి సంవత్సరం విద్యార్థుల కోసం ఈ నెల 19వ తేదీ గురువారం తమ కళాశాల ఆవరణలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు మంగళవారం తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఐటీఐ చదివిన వారు విజయవాడ రమేష్ ఆసుపత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు గురువారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 92986 05175 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఖరీఫ్కు సిద్ధమవుతున్న అన్నదాతలు



విత్తనాలు జల్లుతున్న రైతులు

నున్న(విజయవాడరూరల్): ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులకు గ్రామాల్లో రైతులు సిద్ధమవుతున్నారు. దుక్కులు దున్నడం, నారుమళ్లు పోసుకోవడం లాంటి పనులను చేస్తున్నారు. నున్న, విలేజి కండ్రిక, పాతపాడు, పి.నైవనరం గ్రామాల్లో పలువురు రైతులు నారుమళ్లకు అవసరమైన వరి విత్తనాలను జల్లారు. ఎకరం పొలంలో వరినాట్లు వేసేందుకు రెండు సెంట్లు నారు అవసరమవుతుందనే లెక్క ప్రకారం నారుమళ్లు సిద్ధం చేస్తున్నట్లు నున్న పాలకేంద్రం అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరెడ్డి తెలియచేశారు. ఆ ప్రకారం రైతాంగం నారుమళ్లు పోస్తున్నారన్నారు. అయితే గొల్లపూడి నుంచి ముస్తాబాదు గ్రామం వరకు వరిపంట సాగు చేసే రైతులు గొల్లపూడి కాల్వ మరమ్మతుల పనులు ఇంతవరకు చేపట్టలేదు. కాల్వ ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు గొల్లపూడి కాల్వ నీటి పైనే ఆధారపడి పంటను సాగు చేస్తారు. వేసవిలో కాల్వకు ఎలాంటి మరమ్మతులు నిర్వహించని దుస్థితి. బుడమేరు వరదల సమయంలో కాల్వకు ఏర్పడిన గండ్లను సైతం ప్రభుత్వం పూడ్చలేదు. రబీ సీజన్లో రైతులే ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున ఖర్చులు భరించి సాగు చేసుకున్నారు. ఏపీ ఐడీసీ, ఇరిగేషన్ శాఖ కానీ గొల్లపూడి కాల్వ గురించి పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పనులు జరుగుతున్నా ఇంతవరకు ప్రభుత్వ పరంగా కాల్వ మరమ్మతుల పనులు చేపట్టలేదు.

ఇసుక తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు

కంకిపాడు: మద్దూరు పరిధిలోని కృష్ణానది ఏటిపాయలో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వి.భావనారాయణ హెచ్చరించారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ శాఖల ప్రత్యేక పర్యవేక్షణలో మంగళవారం మద్దూరు ఏటిపాయ వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భావనారాయణ 'సాక్షి'తో మాట్లాడారు. మద్దూరు ఏటి ఒడ్డున ఉన్న స్టాక్ పాయింట్లోని ఇసుక రవాణాకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఆదేశాలు ఉల్లంఘించి ఏటిపాయలో ఇసుక తవ్వకాలకు పాల్పడితే సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇసుక రవాణాకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏటిపాయపై నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో వ్యవసాయాధికారులు



కేసరపల్లిలో నారుమడులను పరిశీలిస్తున్న ఏఓ శివప్రసాద్

కేసరపల్లి(గన్నవరం): రైతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలోని కేసరపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ వరిసాగుకు సిద్ధం చేస్తున్న నారుమడులను ఏవో కె.శివప్రసాద్ పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నారుమడుల్లో కలుపు నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సూక్ష్మ పోషకాల గురించి రైతులకు వివరించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో పొందుపర్చిన జాబితాలో పేర్లు లేని రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సుజాత, మీనా, పలువురు రైతులు పాల్గొన్నారు.

పెద్దఆవుటపల్లిలో..

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లిలో వ్యవసాయ అధికారి జి.రమేష్, ఉద్యాన శాఖాధికారి చంద్ పర్యటించారు. వరి వెద చల్లే పద్ధతిలో విత్తిన పొలాలను, నారుమడులను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వెద చల్లే పద్ధతిలో కలుపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రాయితీపై విత్తనాల కోసం రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఏఓ సూచించారు. ఏఈఓ దుర్గా నాగేశ్వరరావు, వీఏఏ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పెద్దఆవుటపల్లిలో మాట్లాడుతున్న ఏఓ రమేష్

పురావస్తు శాఖ ఉద్యోగుల ధర్నా



కానూరులో ధర్నా చేస్తున్న సిబ్బంది

పెనమలూరు: కానూరులో పురావస్తు సర్వే శాఖ కార్యాలయం వద్ద ఆ శాఖ ఉద్యోగులు మంగళవారం డిమాండ్ల పరిష్కారానికి ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పురావస్తు శాఖ సర్వే సిబ్బంది ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా పురావస్తు సర్వే శాఖలో(ఆర్కాలజీ ఆఫ్ సర్వే) ఉద్యోగులుగా పని చేస్తున్నామన్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం వాట్సాప్ మెసేజ్ పెట్టి తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లో 10 సంవత్సరాలు పని చేసిన ఉద్యోగులను రెగ్యూలర్ చేశారన్నారు. అయితే ఏపీలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. తమకు జనవరి నెల నుంచి జీతాలు ఇవ్వలేదని, మస్టర్ రిజిస్టర్లో పేర్లు రాయటం లేదని, ఉద్యోగులను అనేక రకాలుగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇబ్బందులకు గురి చేయటం తగదు..

తమ సమస్యలపై ఢిల్లీలో ఉన్న డీజీని కలువగా సానుకూలంగా స్పందించారని అయితే ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించలేదని తెలిపారు. పదేళ్లుగా పని చేసిన ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని, వెంటనే పెండింగ్లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు కోర్టుకు వెళ్లారనే సాకుతో ఇబ్బందులకు గురి చేయటం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి న్యాయమైన ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఉద్యోగులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కానూరులోని పురావస్తు శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం ధర్నా కొనసాగించారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ



కల్యాణ మండపంలో అన్న ప్రసాద వితరణ చేస్తున్న కమిటీ సభ్యులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రసాదాలకు దాత లక్ష్మి, నవీన్కుమార్, దుర్గారావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో పలువురు ఉభయదాతలు, ముత్తయిదువులకు ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేసింది. అనంతరం కళ్యాణ మండపంలో ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, మరుపిళ్ల సత్యనారాయణ, కొరగంజి భాస్కరరావు, బంక హనుమంతరావు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

మహిళపై దాడి చేసిన దంపతులపై కేసు

పెనమలూరు: సరిహద్దు వివాదంతో మహిళపై దాడి చేసిన దంపతులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రామానికి చెందిన మేడసాని విజయ వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న తన స్థలంలో 2 సెంట్ల స్థలాన్ని సబ్బినేని చిన్నికృష్ణకు కొద్ది కాలం క్రితం విక్రయించింది. ఆమె పక్క స్థలంలో రేకుల షెడ్డులో ఉంటోంది. ఆమె తన హద్దులో మొక్కలు నాటగా చిన్నికృష్ణ, అతని భార్య వాణి గొడవ పడి కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కానూరులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: కానూరులో ఓ వ్యక్తిపై పలువురు దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం కానూరు కృష్ణనగర్కు చెందిన షేక్ బాషా తన కుమారుడి వివాహానికి మాంసం కోసం హుస్సేన్ అనే వ్యక్తికి రూ.2.37 లక్షలు ఇచ్చాడు. మాంసం తాలుకా ఇంకా బాషా రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా అతను సకాలంలో డబ్బు ఇవ్వలేదు. కొన్ని వాయిదాల తరువాత రూ.34 వేలు ఇచ్చాడు. మిగితా రూ.6 వేలు ఇవ్వలేదు. దీనిపై వివాదం తలెత్తడంతో బాషాపై హుస్సేన్ మరో నలుగురు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గన్నవరం నియోజకవర్గ ఓటర్లు 2,79,994



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన తహసీల్దార్ వెంకటశివయ్య

గన్నవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఏఈఆర్వో, తహసీల్దార్ కె.వెంకటశివయ్య ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 2,79,994 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. మండలాల వారీగా విజయవాడ రూరల్లో 89,315, గన్నవరంలో 74,678, బాపులపాడులో 72,088, ఉంగుటూరులో 43,913 మంది ఓటర్లు ఉన్నారన్నారు. గత సాధరణ ఎన్నికల నాటికి నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలు ఉండగా, కొత్తగా రంగయ్యప్పారావుపేటలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా 1,200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను పునర్వ్యవస్థీకరించాలని టీడీపీ ప్రతినిధి ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు కోరారు. డీటీ లక్ష్మీనాంచారమ్మ, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు చిమట రవివర్మ, నాదెండ్ల మోహన్, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానసిక స్థిరత్వం యోగాతో సాధ్యం



యోగాసనాలు వేస్తున్న సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు

విజయవాడస్పోర్ట్స్: శారీరక దృఢత్వానికి, మానసిక స్థిరత్వానికి యోగాసనాలు ఎంతో దోహదం చేస్తాయని కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్.సుశీల వివరించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమాన్ని నగరంలోని శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కళాశాల విద్యార్థినులతో యోగాసనాలు సాధన చేయించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుశీల మాట్లాడుతూ శారీరక సమస్యలు, మానసిక ఒత్తిడిని జయించేందుకు వ్యాయామం నిత్య దినచర్యలో భాగం కావాలన్నారు. దీనిలో భాగంగానే యోగా నిత్య సాధనతో అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చని విద్యార్థినులకు సూచించారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ యోగాసనాలు సాధన చేయాలని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.సుబ్రహ్మణ్య కుమార్ మాట్లాడుతూ విద్యా ప్రణాళికలో యోగాను భాగంగా చేర్చామని, ప్రతి విద్యార్థి యోగా సాధన చేసేలా ప్రణాళికను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య అధ్యాపకురాలు డాక్టర్ ఎన్.హేమ, వార్డెన్ డాక్టర్ కె.ఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు.

వాటర్ పైప్లైన్కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో అంతర్గత రహదారుల్లోని తాగునీటి పైప్లైన్లకు మరమ్మతులు నిర్వహించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఆదేశాలతో సిబ్బంది మరమ్మతులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్యలు గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో రెండు వాటర్ ట్యాంక్లు, డైరెక్టు పంపింగ్, మోటారు బోర్ల సహాయంతో తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. తాగునీటి సరఫరాలో కాల్వగట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామని, వాటర్ పైప్లైన్ లీక్లు గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ పెనమలూరు గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. దీని కారణంగా గ్రామంలోని శివాలయం, ఆర్సీఎం చర్చి ప్రాంతాలు, అంబేడ్కర్ నగర్, హైస్కూల్ ప్రాంతం, చెరువుకట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

తగిన జాగ్రత్తలతో టీబీ నియంత్రణ



టీబీ వ్యాక్సినేషన్ చేస్తున్న డాక్టర్ శివప్రసాద్

వించిపేట(విజయవాడపశ్చిమ): వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకుంటే టీబీని నియంత్రించవచ్చని షేక్ రాజాసాహేబ్ జనరల్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హాస్పటల్ ప్రాంగణంలోని టీబీ యూనిట్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నియంత్రణ చర్యల్లో భాగంగా తొలిసారిగా సైటీబీ ఇంజక్షన్లను చేయించామన్నారు. టీబీ బాధిత కుటుంబ సభ్యులకు, మధుమేహ పీడితులకు ఈ ఇంజక్షన్ చేసి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం టీబీ చికిత్స విధానాన్ని వివరించారు. వైద్యులు, వైద్య సిబ్బంది, కొత్తపేట టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఏఓ బదిలీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేస్తున్న పి.మురళీకృష్ణ ప్రసాద్ను ప్రభుత్వం చాట్రాయి మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ చేసింది. ఆయన స్థానంలో కలిదిండి మండల పరిషత్ కార్యాలయం నుంచి కె.పార్థసారథిని నియమించింది. సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్న ప్రసన్న జ్యోతి పామర్రు మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ కాగా ఆమె స్థానంలో నూజివీడు పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం నుంచి వెంకటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది.